క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న చైర్మన్ రవినాయక్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల అభివృద్ధి కోసమే ప్రతి ఏటా పది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మూడే రవినాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు దాతలు హైమావతి, సుచిత్ర వారి సహకారంతో నోటుబుక్స్ పంపిణీ చేశారు. పది సంవత్సరాల నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ, పరీక్ష ఫీజు, పరీక్షకు కావాల్సిన ఎగ్జామ్ కిట్స్‌ను ట్రస్ట్ ద్వారా దాతల కృషితో అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులు సంగిత, స్వరూప, మంజుల, సత్యనారాయణరెడ్డి, మణికంత, మొగులయ్య, అనుపమ, జ్యోతి, వరలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సదుపాయాలు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

కొత్తూరు: పట్టణ సమీపంలో ఉన్న గణపతి కాలనీలో అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీతో పాటు పలు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం గ్రామ యువకులు, కాలనీవాసులు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి సమక్షంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. వెంచర్‌కు డీటీసీపీ అనుమతి పొందిన యాజమాన్యం వెంచర్‌లో అభివృద్ధి పనులు మాత్రం చేయలేదన్నారు. దీంతో పాటు వెంచర్ సమీపంలో ఉన్న పాటు కాల్వను సైతం కబ్జా చేసినట్లు ఆరోపించారు. దీంతో ప్రతి వర్షాకాలంలో నీరు ఇళ్ల మధ్యన చేరుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యాజమాన్యంతో అభివృద్ధి పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో యువకులు శివచారి, తుప్పర రవీందర్, రంజిత్, సాగర్, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

షాబాద్: షాద్‌నగర్ నుంచి మాచన్‌పల్లి మీదుగా చేవెళ్లకు బస్సు సౌకర్యం కల్పించాలని మాచన్‌పల్లి గ్రామస్తులు, యువకులు సోమవారం షాద్‌నగర్‌లో ఆర్టీసీ డిపో రీజినల్ మేనేజర్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామం నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు, రైతులు ఆయా పనుల నిమిత్తం చేవెళ్లకు వెళ్తుంటారన్నారు. వారందరికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి మాచన్‌పల్లి మీదుగా చేవెళ్లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సత్తయ్య, గ్రామస్తులు గిరీశ్‌కుమార్, మహేందర్, హరికృష్ణ, కావలి నవీన్, మ్యాతరి స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మీర్‌పేట: ఉద్యోగ భద్రతతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు దాసరి బాబు, యాదయ్య మాట్లాడుతూ.. ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌సీఐ, మీర్‌పేట ప్రధాన రహదారుల్లో కార్మికులు విధుల్లో ఉండగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని.. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఆమె శనివారం వరకు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. వేతనాలు చెల్లించని ఎడల కార్మికులతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ మీర్‌పేట కన్వీనర్ శేఖర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో నీటి ఆదా

- పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ
- ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుకు అవకాశం
- అవగాహన కల్పిస్తే చక్కటి ప్రయోజనం
- దృష్టిపెట్టని అధికారులు



గూడూరు శివారులో డ్రిప్ పద్ధతిలో పండిస్తున్న టమాటా తోట

కొత్తూరు: ప్రస్తుతం వ్యవసాయరంగం సైతం ఇతర రంగాల మాదిరిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని కొత్త పుంతలు తొక్కుతోంది. దీని ఆధారంగా రైతులు తక్కువ శ్రమ.. ఎక్కువ లాభాలు సాధిస్తున్నారు. కాగా ఈ పరిజ్ఞానం కొన్ని గ్రామాల్లోని రైతులకు ఇంకా అందని ద్రాక్షగానే మిగులుతోంది. ప్రతి ఏడాది వ్యవసాయ అధికారులు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులకు అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న రైతు చైతన్య యాత్రలు, మన తెలంగాణ–మన వ్యవసాయంతో పాటు పలు కార్యక్రమాలు రైతులను అధునిక వ్యవసాయం వైపు ఆకర్షించడం లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ రైతులు పాత పద్ధతుల్లోనే పంటలు సాగు చేస్తూ నష్టపోతున్నారు. అలాంటి వారిని గుర్తించి వారికి ఆధునిక వ్యవసాయం వైపు ప్రోత్సహించాల్సిన సంబంధిత శాఖల అధికారులు పెద్దగా దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

బిందు సేద్యంపై అవగాహన కరువు..

మండలంలోని గూడూరు, మల్లాపూర్‌తో పాటు కొన్ని గ్రామాల్లో మాత్రమే రైతులు బిందుసేద్యంతో(డ్రిప్) పంటల సాగు చేస్తున్నారు. మిగిలిన రైతులు పాత పద్ధతుల్లోనే పంటల సాగు చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కో ఏడాది తీవ్రమైన వర్షాభావం కారణంగా పలుచోట్ల వ్యవసాయ బోర్లలో నీరు కొద్దిమొత్తంలో ఉన్న రైతులు మాత్రం పంటల సాగును చేపట్టడం లేదు. పంటలు సాగు చేస్తే నీరు అందక ఎండిపోతాయనే భయానికి గురవుతున్నారు. కాగా ఇలాంటి వారికి అధికారులు బిందు సేద్యం(డ్రిప్ ఇరిగేషన్)పై అవగాహన కల్పిస్తే చక్కటి ఫలితం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. నీటి వసతి తక్కువగా ఉన్నా బిందు సేద్యంతో ఎకరాల విస్తీర్ణంలో పూలు, కూరగాయాల తోటలను సాగు చేయొచ్చు. ముఖ్యంగా బిందు సేద్యంతో నీటి వృథా అస్సలు ఉండదు. మొక్క వేళ్ల దగ్గర నీరు చుక్కలు చుక్కలుగా పడడంతో మొక్కలకు చక్కగా నీటి లభ్యత ఉండి బలంగా ఎదుగుతాయి. అంతేకాకుండా నీటి తడి కూడా చాలా రోజుల వరకు ఉంటుంది. పంటలకు కాల్వల ద్వారా నీరు పారిస్తే ఎక్కువగా వృథా అవుతాయని వ్యవసాయ అధికారులు పలు సభలు, సమావేశాల్లో రైతులకు సలహాలు ఇస్తున్నారే తప్పా డ్రిప్ ఇరిగేషన్ వైపు ప్రోత్సహించడం లేదు.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్‌తో పాటు ఇతర పరికరాలను పంపిణీ చేస్తోంది. కాగా ఇప్పటికీ మండలంలోని పలువురు రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌పై సరైన అవగాహన లేదు. డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. డ్రిప్ ఇరిగేషన్‌తో సాధ్యమైనంతవరకు నీటి ఎద్దడిని అధిగమించొచ్చు. దీనికి తోడు బోర్లలో ఉన్న కొద్దిపాటి నీటితోనే కూరగాయాలు, ఇతర పంటలు సాగుచేసుకోవచ్చు. ఈ దిశగా సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



మల్లాపూర్‌లో డ్రిప్ సౌకర్యంతో సాగుచేస్తున్న ఆస్పరస్ గడ్డి

“ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాం



వ్యవసాయంలో మారుతున్న పద్ధతులకు అనుగుణంగా రైతుల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా నీటి తడిని అందిస్తే చాలావరకు నీటి వృథా ఉండదు. పంటలు సైతం బలంగా ఎదుగుతాయి. డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. రైతులు ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలి.

– గోపాల్‌నాయక్, ఏఓ, కొత్తూరు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సభ్యులు మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం, ఖర్చులు, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేస్తుందన్నారు. విడతల వారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సభ్యులు, అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక నాయకులు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సులభ్ కాంప్లెక్స్‌తో పాటు పలు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, ఏఈ రాయుడు, టీపీఓ శ్రీనివాస్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, సురేందర్, రమేశ్, జనార్దన్‌చారి, తేజ, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్లు విడుదల చేయాలి

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకార్ శివాజి అన్నారు. నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరుతూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీజేవైఎం నాయకులపై జరిగిన దాడికి నిరసనగా మండల కేంద్రంలో నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న శివాజీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఎదురుచూస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా శాఖాల్లో ఉన్న ఖాళీలను గుర్తించి వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఘ్నేశ్, సురేశ్, హరికృష్ణ, శ్రీకాంత్, రాఘవేంద్రాచారి, మల్లేశ్, శివగౌడ్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీగా విజయం సాధించిన నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని ఆయన స్వగృహంలో సోమవారం పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ కానుగు అనంతయ్య, బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించారని గుర్తు చేశారు. ప్రజలందరూ రాబోయే రోజులలో బీఆర్ఎస్‌వైపే మొగ్గు చూపుతారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందిగామ శ్రీనివాస్, బాల్‌రాజ్, జగన్నాథం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మారనున్న అంగన్‌వాడీల రూపురేఖలు

సీడీపీఓ నాగమణి



అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు నూతన సిలబస్ బుక్స్ అందజేస్తున్న సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: చిన్నారులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించి వారి బంగారు భవితకు బాటలు వేయాలని, కేంద్ర ప్రభుత్వం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మార్గదర్శకాలతో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారనున్నాయని సీడీపీఓ నాగమణి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ బడులుగా మారుస్తూ ప్రభుత్వం నూతన విద్యా పాఠ్య ప్రణాళిక–2024ను తీసుకొచ్చింది.అందులో భాగంగా సోమవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నాగమణి ఆధ్వర్యంలో పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన మార్గదర్శకాలతో ప్రీ ప్రైమరీ బడులకు వచ్చే చిన్నారులకు అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నూతన విద్యా పాఠ్య ప్రణాళిక–2024 ప్రియదర్శిని(సిలబస్ బుక్), పూర్వ ప్రాథమిక విద్యాదీపిక పుస్తకాలను అందిస్తామన్నారు. బ్యాచ్‌కి 35 మంది అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ తీసుకుంటారని, ఒక బ్యాచ్‌కు 3 రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ పూర్తి చేసుకొని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ జోత్స్న, రేవతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ప్రీ ప్రైమరీ స్కూల్‌గా మార్చాలనే ఆలోచనతో అంగన్‌వాడీ టీచర్లకు బోధనపై శిక్షణ నిర్వహిస్తుందని సీడీపీఓ శోభారాణి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం చేవెళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 10 సెక్టార్ల నుంచి 35 మంది అంగన్‌వాడీ టీచర్లకు రివైజ్డ్ ప్రీస్కూల్ బోధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ మాస్టర్ ఎస్ఎంఆర్ భారతీరత్నం, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, సునీత, రవిత, నాగమణి, రమాదేవి, శకుంతల, అనురాధ, సృజనవాణి, పారిజాత ఉన్నారు.

వంతెన నిర్మాణంతోనే ప్రమాదాల నివారణ

వైజంక్షన్ కూడలిని పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: పట్టణంలో ప్రమాదాలకు నిలయంగా మారిన జాతీయ రహదారిపై ఉన్న వై జంక్షన్, పెంజర్ల, జేపీదర్గా కూడళ్లలో ఫ్లైఓవర్(వంతెన)లు నిర్మిస్తేనే శాశ్వతంగా ప్రమాదాల నివారణ జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆయన ఎన్‌హెచ్‌ఏఐ సైట్ ఇంజినీర్ భానుమిత్ర, స్థానికులతో కలిసి వై జంక్షన్ కూడలిని పరిశీలించారు. ప్రస్తుతం వై జంక్షన్ కూడలిలో నిర్మించిన అండర్‌పాస్ డిజైన్‌లో ఇంజినీరింగ్, అధికారుల తప్పిదం ఉందన్నారు. కేవలం వారి నిర్లక్ష్యంతోనే అండర్‌పాస్ వృథాగా మారిందన్నారు. మూడు కూడళ్లలో జరుగుతున్న ప్రమాదాలను శాశ్వతంగా నియంత్రించాలంటే ఫ్లైఓవర్లు నిర్మించడమే మార్గమన్నారు. మూడు కూడళ్లు దగ్గరగా ఉండడంతో అన్నింటిని అనుసంధానిస్తూ ఒకటే వంతెన నిర్మించే అవకాశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు. అవకాశం లేని పక్షంలో మూడు వంతెనలను విడివిడిగా నిర్మించాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో జాతీయ రహదారుల సంస్థ ప్రధాన అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. కచ్చితంగా మూడు కూడళ్లలో వంతెనలు నిర్మించే విధంగా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వాహనదారులు, ప్రజలు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలన్నారు. కూడళ్ల వద్ద ప్రజలు రోడ్డు నెమ్మదిగా దాటాలని సూచించారు. ముఖ్యంగా పోలీసులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల తీరుపై ప్రజలు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, గోవర్ధన్‌గౌడ్, శ్రీను, రమేశ్, సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు

షాద్‌నగర్: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకట మాధవరావు అధ్యక్షతన నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా సమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడూ పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులను, లోటుపాట్లను గుర్తించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

28న దుకాణాలకు బహిరంగ వేలం

మొయినాబాద్‌రూరల్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట గల దుకాణాలను (షెటర్లు) అద్దె ఇచ్చేందుకు ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గతంలో ప్రభుత్వం ద్వారా నిర్మించిన 12 దుకాణాలను బహిరంగ వేలం ద్వారా కేటా యిస్తామని తెలిపారు. దారావత్ ప్రతి దుకాణానికి 40 వేల రూపాయలు ఉంటుందన్నారు. దరఖాస్తు చేసేందుకు 28వ తేదీ 12 గంటలలోపు గడువు ఉందన్నారు. 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేలం పాట మండల పరిషత్ కార్యాలయంలో ఉంటుందన్నారు. అగ్రిమెంట్ కాలపరిమితి ఒక సంవత్సరం మాత్రమేనని పేర్కొన్నారు. బహిరంగ వేలంకు వచ్చేవారు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారికి లిఖిత పూర్వక దరఖాస్తు రాసి దానితో పాటు ఓటరుకార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను అందించాలన్నారు. దరఖాస్తుతో పాటు 40వేల డీడీ జతచేయాలన్నారు. దుకాణానికి వేలం పాటలో పాల్గొనేవారు దరఖాస్తులపై దుకాణం నెంబర్ రాయాలని, అదేవిధంగా మండల పరిషత్ ఆవరణలో ఉన్నందున వైన్స్ దుకాణాలకు వినియోగించరాదని ఆమె తెలిపారు. దరఖాస్తుదారుడు మండల నివాసి అయి ఉండాలని సూచించారు. వేలం పాటలో పాల్గొనే వారు 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

- యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థికి విద్యుత్‌షాక్
- మేధ స్కూల్ ఎదుట బైఠాయించిన ఏబీవీపీ నాయకులు



పాఠశాల ఎదుట బైఠాయించిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థి కుటుంబ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి ఆర్మాన్ విద్యుదాఘాతానికి గురయ్యాడని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మేధ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి ఏబీవీపీ(అఖిల భారత విద్యార్థి పరిషత్) విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో నాయకులు పాఠశాల ఎదుట బైఠాయించారు. గాయపడిన విద్యార్థికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కూల్ ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతోనే ఐదో తరగతి చదువుతున్న ఆర్మాన్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఈ ఘోరం జరిగిందని ఆరోపించారు. గాయపడిన ఆర్మాన్‌ను తల్లిదండ్రులు వచ్చేవరకు ఎందుకు ఆస్పత్రికి తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని పాఠశాల యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇంతలోనే ఘటనాస్థలానికి పోలీసులు చేరుకొని ఏబీవీపీ నాయకులు, విద్యార్థి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, మణికంత, ప్రదీప్, అఖిల్, శ్రీకాంత్, నవీన్, భాను, వంశీ, రాకేశ్, సురేశ్, శివ, మహేందర్, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలలో మినహాయింపు సరికాదు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప



షాద్‌నగర్‌రూరల్: వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో రంగారెడ్డి జిల్లాను మినహాయించడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షురాలు అరుణ, నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌గౌడ్, సమత, యాదయ్య, డీటీఎఫ్ మండల నాయకులు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

కేశంపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జిల్లాలో నిర్వహించకపోవడంతో స్థానిక ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. జిల్లాలో పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, ప్రమోషన్లతో జిల్లాకు వచ్చిన వారికి మరో జిల్లాకు బదిలీ చేయాలని కోరుతూ రెవెన్యూ ఆర్ఐ నివేదితకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు ఉండాల్సిన ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వం అధికంగా కేటాయించిందన్నారు. దీంతో మున్ముందు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి జిల్లాకు అదనంగా వచ్చిన ఉపాధ్యాయులకు సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి వారికి బాధ్యతలు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల కార్యదర్శి రవికుమార్, ప్రకాశ్, శ్యామలా దేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

కొందుర్గు: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని సోమవారం ఉపాధ్యాయ జేఏసీ నాయకులు కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ ఎంఎస్ నెంబర్ 317 ప్రకారం రంగారెడ్డి జిల్లాకు కేటాయించిన కేడర్ స్ట్రెంథ్‌కు భిన్నంగా దాదాపు 400 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, జిల్లాలో అదనపు ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించి, అర్హులైన వారికి పదోన్నతులు, బదిలీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, శివారెడ్డి, హన్మంతు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

షాబాద్: ప్రమోషన్, బదిలీలలో రంగారెడ్డి జిల్లాకు చెందిన స్థానిక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మండల పరిధిలోని హైతాబాద్, తాళ్లపల్లి, షాబాద్ తదితర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు సంఘమేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.